ఓటీఎస్‌తో సత్ఫాలితాలు

ముషీరాబాద్ సర్కిల్‌లో 5 రోజుల్లో కోటి రూపాయలకు పైగా పాత బకాయిల వసూలు

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను బకాయిల వడ్డీలో 90 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్ జారీచేసిన వన్ టైమ్ స్కీమ్ (ఓటీఎస్) జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్‌లో సత్ఫలితాలు ఇస్తోంది. ఈ నెల 7వ తేదీన అమలులోకి వచ్చిన ఈ స్కీమ్ వల్ల గడచిన అయిదు రోజుల్లో మొండి బకాయిదారుల నుంచి జీహెచ్‌ఎంసీ ట్యాక్స్ విభాగం అధికారి, సిబ్బంది కోటి రూపాయలకు పైగా పాత బకాయిలను వసూలు చేసి జీహెచ్‌ఎంసీ ఖజానాకు జమ చేశారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామానుజలరెడ్డి పర్యవేక్షణలో ఏఎంసీ ప్రవీణ్‌చంద్రతోపాటు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లు సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. ఓటీఎస్‌ను వివరిస్తూ పెండింగ్ బకాయిలను వసూలు చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను చెల్లించకుండా 5 నుంచి 10 లక్షలకు పైగా ఉన్న ఇంటి యజమానులు, వ్యాపారస్తులు కూడా 90 శాతం వడ్డీ రాయితీ పథకానికి ఆకర్షితులై జీహెచ్‌ఎంసీకి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఈ పథకం వల్ల జీహెచ్‌ఎంసీ ఖజానాకు ఆదాయం పెరగడంతోపాటు ఇంటి యజమానులకు వడ్డీ మాఫీపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా ఆస్తి పన్ను చెల్లించని పలు వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు వడ్డీ రాయితీ పథకంపై జీహెచ్‌ఎంసీ అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. సర్కిల్‌కు ఈ నెలలో రూ.13 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశించారు. ఈ టార్గెట్‌కు చేరుకోవడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు వడ్డీ పథకంపై ఆస్తి పన్ను బకాయిదారులకు అవగాహన కల్పిస్తూ పన్ను వసూలు చేస్తున్నారు.



ఆబిడ్స్‌లోని ముషీరాబాద్ సర్కిల్ భవనం

సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై ప్రభుత్వం కల్పించిన 90 శాతం వడ్డీ రాయితీ పథకాన్ని ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం విధించిన ఓటీఎస్ స్కీమ్ ద్వారా 90 శాతం రాయితీ వస్తుంది. ఈ నెల 31వ తేదీలోపు ఈ పథకం అమలులో ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ స్కీమ్ పట్ల అవగాహన కలిగి సంబంధిత జీహెచ్‌ఎంసీ ట్యాక్స్ అధికారులను కలిసి బకాయిలు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

- రామానుజలరెడ్డి, డీఎంసీ, ముషీరాబాద్ సర్కిల్

పైప్‌లైన్ల ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలి



మట్టి కుప్పలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో పైప్‌లైన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. బుధవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్ చౌరస్తా నుంచి నూతనంగా మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టిన ప్యాచ్ వర్క్ పనులు నిలిచిపోవడంతో పాదయాత్ర చేసి సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్ల నిర్మాణం తర్వాత మట్టికుప్పలను తొలగించకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్ వెంకటేష్‌యాదవ్, నాయకులు రూపేష్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రూపకిరణ్, సూరి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు

అంబర్‌పేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వద్ద ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో నిబంధనలు అతిక్రమించి బోర్డు ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డిపై హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అంబర్‌పేట సీఐ డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మకుంట వద్ద ఉన్న స్థలంలో హైడ్రా అధికారులు ఇటీవల విచారణ నిర్వహించి ప్రభుత్వ స్థలంగా నిర్ణయించారు. ఆ స్థలంలో హైడ్రా ఆధ్వర్యంలో బతుకమ్మకుంట పునరుద్ధరణకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. అయితే ఈ నెల 11న ఈ స్థలం తనదేనని ఎడ్ల సుధాకర్‌రెడ్డి బోర్డు ఏర్పాటు చేశారు. దీనిపై హైడ్రా అధికారులు బోర్డును తొలగించి అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారులను అడ్డుకున్నందుకు నిబంధనలు అతిక్రమించినందుకు ఎడ్ల సుధాకర్‌రెడ్డిపై కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి వైద్యం పొందితే పూర్తిగా నివారణ సాధ్యమేనని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీలోని బ్లూబర్డ్స్ హైస్కూల్‌లో ఎంజేఆర్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెస్ట్ సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ.... మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి అన్నారు. కార్యక్రమంలో బ్లూబర్డ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ మనోజ్‌కుమార్, డాక్టర్ యోక్షిత, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోరక్‌నాథ్, దీన్‌దయాల్‌రెడ్డి, సత్యనారాయణబాబు, రాజేందర్, శ్రీకాంత్‌యాదవ్, టీఆర్ గోవింద్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, ఎంజేఆర్ క్యాన్సర్ స్క్రీనింగ్ రీజినల్ సెంటర్ అధ్యక్ష కార్యదర్శులు మన్మిత్ జాగీ, సవితాప్రేమ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.



కూల్చిన గోడను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పద్మశాలీ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి: బీజేపీ

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కో కన్వీనర్ మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పద్మశాలీ కాలనీలోని ఇంటి నెంబర్ 1-4-27/71/36 పక్కన గల సుమారు 700 గజాల ప్రభుత్వ స్థలంలో గతంలో ప్రభుత్వం కబ్జాకాకుండా ప్రహరీ నిర్మించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ హయాంలో ఈ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సైతం అందజేశారని తెలిపారు. కానీ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్థలం బోర్డును తొలగించారన్నారు. బుల్డోజర్‌తో స్థలాన్ని సైతం చదును చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే స్థానికులతో కలిసి ఎంఆర్‌వో, ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. త్వరలో హైడ్రా కమిషనర్, జిల్లా కమిషనర్‌కు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నిత్యానంద్, నాగేందర్, అనిల్, బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్‌నాయకులు దావత్ మచ్చేందర్, భాగ్యమ్మ, జనక్‌రాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సామాన్యులకు పెనుభారంగా కేంద్ర బడ్జెట్

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ కేవలం బడా కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా, సామాన్యులకు పెనుభారంగా ఉందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పట్టణ ప్రాంతాల వికాస వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2025 - ప్రజా ప్రత్యామ్నాయం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రూ.50.65 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ద్వారా పేదలు, రైతులు, యువత, మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రసంగంలో పేర్కొన్నప్పటికీ అందుకు విరుద్ధంగా బడ్జెట్ కేటాయింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామయ్య, మెడికల్ రిప్రజెంటివ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, నాయకులు శివకుమార్, ఎల్‌ఐసీ దక్షిణ మధ్య జోనల్ ఫెడరేషన్ ప్రధాన కారదర్శి రవీంద్రనాథ్, పట్నం సంస్థ నాయకులు ఉమామహేశ్వరరావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



త్యాగరాయ గానసభలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పురస్కారగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- రంగారెడ్డి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- ఘనంగా ఉమెన్స్ డే వేడుకలు

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రంగారెడ్డి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆమె తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహిళా స్వయం సమృద్ధి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మహిళలు రాణించాలన్నారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు అన్ని రంగాల్లో సగం వాటా కల్పించాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ తమ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్‌పర్సన్ జి.సూర్యకళ, ఉమాదేవి, కో-కన్వీనర్ జె.ఝాన్సీరాణి, కన్వీనర్ కె.జానకి, కో-చైర్‌పర్సన్ స్వర్ణకుమారి, ప్రతినిధులు ఝాన్సీ లక్ష్మీబాయి, శ్రీదేవి, లక్ష్మీఈశ్వరి, చంద్రకళ, రాజేశ్వరి, సరోజ, సాంబశివరావు, లక్ష్మీనారాయణరావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి

...య్యారు. రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ మహిళా సంఘం మహిళలు తరలి వచ్చి ఆట, పాట, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్, ఆయన సతీమణి అరవింద, నాయకులు తులసి సత్యనారాయణ, ధర్మపురి శ్రీనివాస్, ఉషారాణి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, మాధవి, పాండు, మనోహర్, జనార్దన్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో..



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: అంబర్‌పేట శ్రీవిరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో న్యూపటేల్‌నగర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఐన్‌కుమార్‌చారి, నాయకులు స్వాతి, రాధ, రోజా, రేఖ, శైలజ, రమాదేవి, మాధవి, వరలక్ష్మి, రజని, స్రవంతి పాల్గొన్నారు.

అభినందనీయం

చిక్కడపల్లి: మహిళలు పలు రంగాల్లో రాణించడం అభినందనీయమని కేంద్రమాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ సందర్భంగా వివిధ రంగాల మహిళలకు మహిళాశిరోమణి-2025 అవార్డుల ప్రదాన సభ ఘనంగా జరిగింది. యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన ఈ సభలో హెచ్‌ఎండీఏ అధికారి డి.చక్రపాణి, కెనరాబ్యాంక్ డీజీఎం మాలిని, హ్యాండ్లూంశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేముల రాధికనరేందర్‌రెడ్డి, సివిల్ కోర్టు అధికారి అంజనికుమారి, వీరభోగవసంతరాయలు, నిర్వాహకులు జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధించుకోవాలి

నల్లకుంట : మహిళల హక్కులను సాధించుకోవడానికి సంఘటితంగా పోరాటం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని వారన్నారు. తెలంగాణ రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని సంఘం నర్మద భవన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు బిక్కుమళ్ల నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నల్లకుంట కార్పొరేటర్ యాకర.అమృత, డాక్టర్ వినోద వెంకటస్వామి, డాక్టర్ దివిటి అంజనాదేవి, డాక్టర్ పల్లవి, అశ్వాపురం అరవిందలు హాజర...



తిలక్‌నగర్ వేడుకల్లో కార్పొరేటర్ అమృత, సంఘం అధ్యక్షుడు వేణుమాధవ్ తదితరులు

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి : డీబీఎఫ్

కవాడిగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. బుధవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవన్ నుంచి ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఆరోపించారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 6.3 శాతం నిధులు కేటాయించి, ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. ప్రారంభమైన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల బడ్జెట్‌లోనైనా ఎన్నికల హామీ మేరకు 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలని సీఎంను కోరారు. అంతర్జాతీయ మోడల్ స్కూల్‌ను ప్రతి మండల కేంద్రంలో ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. ఈ పాదయాత్రకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదమ్మ, చిత్ర, రాణి, శ్యామల, విజయలక్ష్మి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

నీరాకేఫ్ బదిలీ హర్షణీయం

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్‌ను బీసీ సంక్షేమ శాఖలోని కల్లు గీత ఫెడరేషన్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తమైంది. ఈ మేరకు తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీరా కేఫ్‌ను టూరిజం శాఖ నుంచి కల్లుగీత కార్పొరేషన్‌కు పూర్తి ఆస్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణగౌడ్, పోతగాని ఆయిలన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తదిదరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను స్వాగతిస్తున్నాం'

నల్లకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను స్వాగతిస్తున్నామని, అయితే ముందుగా ప్రభుత్వ స్కూల్స్ గురుకుల పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ కోరారు. హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూసేసిన ప్రభుత్వ స్కూళ్లను ఓపెన్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అవసరాలు తీర్చడంతోపాటు గురుకులాల్లో నాణ్యమైన విద్యతోపాటు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని, సబ్‌ప్లాన్ నిధులు అర్హత గల వారికే ఇవ్వాలని, రాజకీయ నేతల ప్రమేయం లేకుండా చూడాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీల హక్కులను హరిస్తోందన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మధుమేహం, కర్తపోటు, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యం పొందాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం బాకారంలో ఎన్‌సీడీ నాన్ కమ్యూనికబుల్ డీసీజస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్య శిబిరాన్ని డాక్టర్ మనోజ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గుండె జబ్బులు, స్ట్రోక్, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశవ్యాధులు అంటువ్యాధులు కాదని అయినప్పటికీ మరణాలకు ప్రధాన కారణాలు అన్నారు. రోజు రోజుకు ఈ వ్యాధుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. ఈ వ్యాధులకు ప్రధాన కారణం హానికరమైన మద్యం, పొగాకు, అనారోగ్యకరమైన ఆహారం, తగిన శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ఊబకాయం, రక్తంలో చెక్కెర, కొలెస్ట్రాల్ పెరగడం వల్ల వస్తాయన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఎన్‌ఎం పద్మ, లత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

స్క్రాబ్ గోదాంలో పేలుడు.. కార్మికుడికి తీవ్ర గాయాలు

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్ నగర్‌లోని కట్నీకాంటా సమీపంలో ఓ ప్లాస్టిక్ స్క్రాబ్ గోదాంలో బుధవారం భారీ పేలుడు సంభవించింది. ఓ కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కట్నీకాంటా సమీపంలో కరీం అనే వ్యక్తి ప్లాస్టిక్ స్క్రాబ్ గోదాం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద బిహార్‌కు చెందిన ఇసాక్ అహ్మద్(28) ప్లాస్టిక్ వస్తువులను పగలగొట్టి భద్రపరిచే పనిచేస్తుంటాడు. ఇందులో భాగంగా గుర్తుతెలియని కెమికల్ డబ్బాను పగలగొడుతుండగా భారీ శబ్దంతో పేలడంతో పనిచేస్తున్న కార్మికుడికి తీవ్ర గాయాల పాలు అయ్యాయి. దీంతో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా సంఘటనా స్థలంలో భారీ శబ్దం వల్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భోలక్‌పూర్ బిలాల్ మసీదు వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ముషీరాబాద్ సీఐ రాంబాబు, ట్రాఫిక్ పోలీసులు

మసీదుల వద్ద ప్రత్యేక బందోబస్తు : సీఐ

ముషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామని ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానికుల విజ్ఞప్తి మేరకు సీఐ రాంబాబు, డీఐ నదీమ్, ట్రాఫిక్ పోలీసులు భోలక్‌పూర్‌లోని బిలాల్ మసీదు తదితర ప్రాంతాలలో పర్యటించి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ అక్లక్ హుస్సేన్, బిలాల్‌మసీదు ముత్తవల్లి బిల్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'బండరాయిని పేల్చడం నిలిపేయాలి'

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలోని బీ వీధిలో నిర్మిస్తున్న వర్షం నీరు పైప్‌లైన్ల నిర్మాణంలో ఉన్న పెద్ద బండరాయిని తొలగించేందుకు బిల్డర్ స్టిక్స్‌తో బండరాయిని పేల్చడాన్ని వెంటనే నిలిపివేయాలన సమీపంలోని బిందు రెసిడెన్సీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆర్.సిద్ధగౌడ్, ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌బాబు, బీజేపీ నాయకుడు పి.గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాంతం నుంచి పైప్ లైన్ నిర్మాణాన్ని సత్వరమే తొలగించి అపార్ట్‌మెంట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జానపద అకాడమీ ఏర్పాటు చేయాలి

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జానపద, సినిమా కళాకారుల కోసం జానపద అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజాసాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ నాయకులు మురళీధర్ దేశ్‌పాండే అధ్యక్షతన జానపద, సినిమా కళాకారుల సమావేశం జరిగింది. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖకు నూతన ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, డప్పు స్వామి, జి.రమేష్, చంద్రుడు, గంగరాజు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు పరామర్శ

చిక్కడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకుని, స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ ముఠా పద్మను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయిచంద్, జి. అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.